క్లుప్తంగా

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


శిరీష

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శిరీష ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఎంబీఏ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న శిరీష ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.జహంగీర్ పర్యవేక్షణలో రీసెర్చ్ చేశారు. ఏ స్టడీ ఆన్ క్రెడిట్ స్కీమ్స్ ఆఫర్డ్ బై కమర్షియల్ బ్యాంకు టూ మైక్రో అండ్ స్మాల్ ఎంట్రప్రెన్యూర్ విత్ రెస్పెక్ట్ టు ఏరెస్ట్ వైల్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఓయూ గౌరవ డాక్టరేట్ అందజేసింది. శిరీషకు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్ తోపాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

దివ్యాంగులకు వీల్‌చైర్‌లు అందజేత



చారకొండ: మండలంలోని జూపల్లిలో సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఫౌండేషన్ చైర్మన్ నకినమోని రాములు యాదవ్ గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు, వృద్ధురాలికి వీల్‌చైర్, సపోర్టు స్టాండ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రాములు యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో గతంలో ముగ్గురికి, మరో ఇద్దరికి దివ్యాంగులకు చేయూతనిచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల్, లింగమయ్య, తదితరులు ఉన్నారు.

ఇళ్లపైనే విద్యుత్ తీగలు



పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్ ఎస్సీ కాలనీలో ఇళ్లపైనే 11 కేవీ విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. రాత్రివేళలో ఈదురు గాలులు వీచినప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని గ్రామస్తులు వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు అరచేతితో పెట్టుకొని ఇళ్లపైకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పిల్లలు ప్రమాదాలబారిన పడకముందే విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో జాతీయ ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పాటు కాల్వలలో పూడిక తీత, చెరువు కుంటలలో ఒండ్రుమట్టి తరలింపు పనులు చేస్తున్నారు. వ్యవసాయ పొలాలకు ఒండ్రుమట్టి తరలించుకునేందుకు టాక్టర్లను ఏర్పాటు చేసుకుంటే కూలీల ద్వార ఒండ్రుమట్టిని నింపుతున్నామని ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపారు. ప్రస్తుతం గొల్లవానికుంటలో పూడిక తీత పనులు కొనసాగుతున్నాయని వివరించారు. రైతులంతా ఒండ్రుమట్టిని తీసుకెళ్లాలని ఆయన కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని స్టేడియం మైదానంలో వేసవి క్రికెట్ పోటీలను గురువారం కల్వకుర్తి క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ ప్రారంభించారు. మొదటి రోజు కల్వకుర్తి, జడ్చర్ల జట్ల మధ్య పోటీలు రసవత్తరంగా కొనసాగింది. కల్వకుర్తిపై జడ్చర్ల జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అండర్ 16 విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, శిక్షకుడు నవీన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

బిజినేపల్లి: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ కథలప్ప ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి 20 మంది ఎంపీటీసీలకు గాను కేవలం ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరు అయ్యారని దీంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. సమావేశం తేదీని తిరిగి ప్రకటిస్తామని తెలిపారు.

బాబోయ్ కుక్కలు

- భయాందోళనలో ప్రజలు
- ఒక్కరోజే 10 మందిపై వీధి కుక్కల దాడి


నర్సాయిపల్లిలో కుక్కల దాడిలో గాయపడిన మహిళ


కోడేరులో రోడ్లపై తిరుగుతున్న కుక్కలు

కోడేరు: గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు హడలెత్తిస్తున్నాయి. పల్లెల్లో కుక్కలను నియంత్రించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా వీటి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఇప్పటికే ఉన్న కుక్కలతో గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులు, చిన్నారులు ఇంటి నుంచి కాలు బయట పెట్టేందుకు వణికిపోతున్నారు. మండలంలోని ఏ గ్రామంలో చూసిన ఎక్కడిపడితే అక్కడే కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీధి కుక్కలు రోడ్లపై గుంపులుగా కన్పించడంతో వాటిని చూసి వెనుదిరిగి వస్తున్నారే తప్పా ముందుకు వెళ్లేందుకు సాహసించడం లేదు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో గత నెల ఏప్రిల్‌లో 20 మంది కుక్కకాటు బారిన పడ్డారు. మే నెలలో ఇప్పటి వరకు 12 మందిపై వీధి కుక్కలు దాడి చేశాయి. అనధికారికంగా ఇంకా చాలా మంది ఉంటారని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో చేతిలో కర్ర లేనిదే బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

మాంసపు వ్యర్థాలతోనే..

గ్రామీణ ప్రాంతాలల్లో మాంసం విక్రయిదారులు వాటి వ్యర్థాలను గ్రామ శివారులో పడేయడంతో కుక్కల బెడద అధికంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. మరి కొందరు దుకాణాల ఎదుటే వ్యర్థాలు ఉంచడంతో కుక్కలు గుమికూడుతున్నాయి. దీంతో అటువైపు గుండా వచ్చే ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. మాంస విక్రయదారుల నిర్లక్ష్యం వల్ల కుక్కకాటుకు గురవుతున్నామని పలు గ్రామాల ప్రజలు వాపోయారు.

నర్సాయిపల్లిలో 10మందిపై దాడి..

మండలంలోని నర్సాయిపల్లి, కోడేరు, జనుంపల్లి, నాగులపల్లి, తదితర గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. కుక్కలు బౌ అంటే ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. ఎక్కడ వచ్చి కాటు వేస్తాయోనని భయం భయంగా ప్రజలు బయటకు వెళ్తున్నారు. ఈ నెల 13న నర్సాయిపల్లిలో ఒకే రోజు 10 మందిపై కుక్కలు దాడి చేశాయి. మండలంలో 800 వందల పైగా వీధి కుక్కలు ఉన్నాయని పశువైద్య సిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నియంత్రణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కుక్కల బెడదను నివారించాలి



రోజురోజుకి కుక్కల సంఖ్య పెరుగుతోంది. వాహనాల పైకి కూడా ఎగబడుతున్నాయి. దీంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. నడుచుకుంటు వెళ్లేవారు బిక్కుబిక్కు మంటూ ముందుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కుక్కల కారణంగా ప్రజలు బయట తిరగేందుకు జంకుతున్నారు. అధికారులు స్పందించి నివారణ చర్యలు చేపట్టాలి.

– దానయ్య, కోడేరు

అందుబాటులో మందులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటుకు మందులు అందుబాటులోఉన్నాయి. కుక్కల దాడిలో గాయపడిన వారికి మెరుగైనా వైద్యం చేస్తున్నాం. కుక్క కాటుకు గురైనా బాధితులు వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి. 24 గంటలు తమ సిబ్బంది అందుబాటులోనే ఉంటారు.

– దశరథం, డాక్టర్, పీహెచ్‌సీ, కోడేరు

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం బీఆర్‌ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మార్కెట్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ వరి పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు సన్నాలు పండించే వారికి మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. రైతులకు ఇచ్చిన అన్ని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. రైతులందరికీ బోనస్ ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదిరాల యాదన్నగౌడ్, పోతుల వెంకటేశ్వర్లు, కాటం జంబులయ్య, భాస్కర్‌గౌడ్, కృష్ణమూర్తి, కట్టా శ్రీనివాసులు, ఖాదర్‌పాషా, రాంచందర్, జీవీఆర్ నాయుడు తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా మీసేవ కేంద్రాలు


పెద్దకొత్తపల్లిలో నిరుపయోగంగా ఉన్న మీసేవ కేంద్రం

పెద్దకొత్తపల్లి: మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో ఉన్న మీసేవ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. జనవరి నెలలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ కేంద్రాలను ప్రారంభించారు. 4 నెలలు అయిన నేటికి మీసేవ కేంద్రాలు వినియోగంలోకి రాలేదు. ఒక్కొక్క మీసేవా కేంద్రానికి భవన నిర్మాణం కోసం రూ.10.50 లక్షలు, కంప్యూటర్‌ల కొనుగోలుకు రూ.2 లక్షలు వెచ్చించారు. ప్రతి మీసేవ కేంద్రానికి సరఫరా చేసిన అవసరం ఉన్న ఫర్నీచర్‌తోపాటు కంప్యూటర్‌లను ప్రస్తుతం గ్రామ పంచాయతీ సిబ్బంది వినియోగించుకుంటున్నారు. గ్రామాలలో ఉన్న మీసేవ కేంద్రాలకు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇచ్చి కేంద్రాలను ప్రారంభించాలని విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పడకేసిన 'మన ఊరు–మన బడి'


మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిలిచిన తరగతి గదుల నిర్మాణం పనులు

లింగాల: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన మన ఊరు–మన బడి పథకం మండలంలో నత్తనడకన కొనసాగుతోంది. ఈ పథకం ద్వారా మండలంలో మొదటి దశలో 10 పాఠశాలలను ఎంపిక చేసి పనులను మంజూరు చేశారు. పాఠశాలలో మౌలిక వసతులతో పాటు, కొన్ని పాఠశాలలో తరగతుల గదుల నిర్మాణాలు చేపట్టారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన తరగతి గదుల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. నెలలు గడుస్తున్నా పనులు పున:ప్రారంభం కాకపోవడంతో వేసవి సెలవుల అనంతరం కూడా భవనాలు వాడుకలో వచ్చే అవకాశాలు కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పనులకు నిధుల కొరతతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌లో మధ్యలో పనులు నిలిపివేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో కూడా కనీస వసతుల కల్పన కలగానే మిగిలి పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన ఊరు–మన బడి పథకం అమలుకు నిధులను విడుదల చేసి పనులను పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుల సంక్షేమానికి కృషి


తెలకపల్లిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న రాజమహేందర్‌రెడ్డి


ఉప్పునుంతలలో

తెలకపల్లి: రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని సింగిల్‌విండో డైరెక్టర్ రాజమహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. రైతులు వడ్లను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన హమాలీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి హమాలీలతో ఫోన్‌లో మాట్లాడి కొనుగోలు కేంద్రానికి రప్పించి సమస్యను పరిష్కరించారు. అనంతరం రాజమహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో హమాలీల కొరత లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ నర్సింహ, వీఓఏలు పరహాద్ బేగం, రైతులు వీరారెడ్డి, తిరుపతయ్య, నిరంజన్ రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పీఏసీఎస్ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ సత్తు భూపాల్‌రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవి, ధాన్యం కొనుగోలు ఇన్‌చార్జ్ శోభ పరిశీలించారు. ధాన్యంలో తేమ శాతాన్ని తనిఖీ చేశారు. రైతులు నాణ్యతతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధర పొందాలని వారు రైతులకు సూచించారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలతోపాటు సంబంధిత ఏఈఓతో ధ్రువీకరణ పత్రం వెంట తీసుకొని రావాలని వారు సూచించారు.

రేపటి నుంచి వీరభద్రుడి ఉత్సవాలు


ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం, (ఇన్‌సెట్‌లో) స్వామివారి మూల విరాట్

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు వీరభద్ర స్వామి 10వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజు గణపతి హోమం, స్వామివారికి దాసంగాల సమర్పణ, నవగ్రహ హోమం, అఖండ భజన కార్యక్రమాలు, ట్రాక్టర్ రివర్స్ గేర్, భజన పోటీలు ఉంటాయన్నారు. రెండో రోజు రుద్రహోమం, బండలాగుడు పోటీలు, సుదర్శన హోమం, నందికోళ్ల సేవా కార్యక్రమాలు కొనసాగుతాయి. మూడో రోజు కుంకుమార్చన, స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం, భద్రకాళీ అమ్మవారికి వడి బియ్యం కార్యక్రమం, పూర్ణాహుతి కార్యక్రమం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. స్వామి వారి ఉత్సవాలకు దాతల సహకారంతో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. బండలాగుడు పోటీలో పాల్గొనే వారు పేర్ల నమోదుకు, పూర్తి సమాచారం కోసం 99496 01761, 81870 48094, 99125 77415, 99510 01042, 95057 08096, 97059 46996 నంబర్లను సంప్రదించాలన్నారు.

మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి


పెంట్లవెల్లి మండలం కొండూరు పాఠశాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

చిన్నంబావి: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వగ్రామం అయిన పెద్దదగడ, తను చదువుకున్న పెద్దమారు గ్రామాల్లోని పాఠశాలను దత్తత తీసుకుని విద్యాభివృద్ధికి కృషి చేస్తానని గతంలో చెప్పిన మాట ప్రకారం ఆయా పాఠశాలలను రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ కేతూరి ధర్మతేజ సందర్శించారు. ఈ సందర్భంగా పెద్దదగడలో అదనపు తరగతులు, పూర్తిగా డిజిటల్ ద్వారా విద్యబోధన, నిత్యం అందుబాటులో ఉండే విధంగా స్టడీ హాల్ వంటి వాటిని ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులతో కలిసి పాఠశాలను పరిశీలించారు. అదేవిధంగా పెద్దమారులో సైతం మౌలిక వసతులు ఏర్పాటు ప్రత్యేకమైన దృష్టితో నియోజకవర్గంలోనే ఆదర్శపాఠశాలగా మార్చేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తను పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు మంత్రి ప్రత్యేకమైన దృష్టితో పెద్దదగడలో త్వరలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారన్నారు. అందులో భాగంగా గ్రామంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులై ఉన్నత శిఖరాలకు అధిరోహించాలనే ఉద్దేశంతో కార్యచరణను రత్నగిరి ఫౌండేషన్‌కు అప్పజెప్పరన్నారు. తనపై నమ్మకం ఉంచినందుకు అన్ని హంగులతో పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తానని ఆయన చెప్పారు. తన దృష్టి వచ్చిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీను, జగదీష్, యుగంధర్‌గౌడు, శంకర్ యాదవ్, వెంకటేష్, రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు మరమ్మతు చేపడుతాం

పెంట్లవెల్లి: మండలంలోని పలు పాఠశాలలను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కన్వీనర్ ధర్మతేజ ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. పాఠశాలలోని తలుపులు, కిటికీలు, కంపౌండ్‌లు, తరగతి గదులు వంటి వాటిని పరిశీలించి వివరాలు సేకరించారు. త్వరలోనే అన్ని పాఠశాలలోని మౌలిక వసతులు, మరమ్మతు చేపడుతామని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ తెలిపారు. కొండూరు, సిగవరం, పెంట్లవెల్లి గ్రామాల పాఠశాలలో వారు పర్యటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, కురుమయ్య, మధులు పాల్గొన్నారు.

ఎన్నికల రెమ్యునరేషన్ డబ్బులివ్వాలి


డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశాకార్యకర్తలు, నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఇవ్వాల్సిన రెమ్యునరేషన్ డబ్బులను వెంటనే చెల్లించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ ఆశా కార్యకర్తలతో డ్యూటీలు చేయించుకొని రెమ్యునరేషన్ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న కార్యకర్తలకు కిందిస్థాయి సిబ్బందికి మున్సిపల్ కార్మికులు రెమ్యునరేషన్ చెల్లించకుండా తమకేమి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆశా కార్యకర్తలకు రావాల్సిన పెండింగ్ డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, గుంపల్లి అశోక్, శ్రీదేవి, శివలీల, కృష్ణవేణి, భాగ్యమ్మ, అలివేల, వసుంధర, వరలక్ష్మి, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై రైతన్న ఆసక్తి


పొలాలకు తరలించేందుకు సేంద్రియ ఎరువులను సిద్ధం చేస్తున్న రైతులు

లింగాల: పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వానాకాలం సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూత్రప్రాయంగా ప్రకటించడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దుక్కులను దున్ని వర్షపు నీరు భూమిలోకి ఇంకే విధంగా పొలాలను తయారు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఒండ్రుమట్టితో పాటు, సేంద్రియ ఎరువులను కూడా పొలాల్లో వెదజల్లుతున్నారు. పలు గ్రామాలలో రైతులు పశువుల పేడ ఎరువును పోగు చేసుకొని పొలాలకు తరలించే పనులలో నిమగ్నమయ్యారు.

దొంగల బెడద.. రైతుల ఆందోళన


ఉప్పునుంతల మండలం కాంసానిపల్లిలో చోరీ చేసిన వైర్లను వదిలిపెట్టి వెళ్లిన దొంగ

అచ్చంపేట రూరల్: వ్యవసాయ పంట పొలాల్లోని బోరు మోటార్ల కేబుల్‌వైర్లు చోరీకి గురవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. చాలా చోట్ల కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లడంతో రైతులు దిక్కుతోచని స్థితిలోపడుతున్నారు. కేబుల్ వైర్ల చోరీతో పంట పొలాలకు నీరుపెట్టలేక, మళ్లీ దొంగలు చోరీకి పాల్పడతారెమోనని రైతులు సతమతమవుతున్నారు. పంట పొలాల్లోని బోరు మోటార్ల కేబుల్ వైర్ల దొంగల బెడద ఎక్కువవడంతో రైతులకు కంటి మీద కునుకులేకుండా పోయింది.

తప్పించుకున్న ఓ దొంగ..

తాజాగా ఉప్పునుంతల మండలం కాంసానిపల్లిలో మూడు రోజుల కిందట అర్ధరాత్రి వేళ ఓ దొంగ హల్‌చల్ చేశాడు. బోరుబావుల వద్ద ఉన్న కేబుల్ వైర్లను చోరీ గ్రామ నడిబొడ్డున తచ్చాడుతూ కన్పించాడు. గొంగడి వేసుకుని అందులో కేబుల్ వైర్లను దాచుకుని ఓ వృద్ధురాలి కంట పడ్డాడు. వృద్ధురాలు కేకలు వేసింది. విన్న సమీప రైతు జగదీశ్వర్‌రెడ్డి ఆ దొంగను పట్టుకుని వివరాలు అడుగుతుండగా... రైతు చేతివ్రేళ్లను కొరికి గొంగడి, కేబుల్ వైర్లు, ఇతర వస్తువులను ఊరి రచ్చకట్ట వద్ద వదిలి పరారయ్యాడు. కొందరు గ్రామస్తులు గమనించి అతని వెంట పరుగెత్తినప్పటికీ చిక్కకుండా పారిపోయాడు. ఇలా అచ్చంపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో, శివారులోని పొలాల్లో సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

నష్టం భారీగానే...

దొంగిలించిన వైరు అమ్మితే దొంగలకు రెండు, మూడు వేలు వస్తుంది. అదే రైతుకు కేబుల్ వైరు ఖర్చు కనీసం రూ.2,500 అవుతుంది. మోటార్లు తీసి మళ్లీ బిగించడానికి, వైరింగ్ చేయడానికి రూ.3 వేలు, బేరింగ్‌లు, సీల్, మెకానిక్ ఖర్చు అంతా కలిపి రూ.1,500 అవుతుంది. దీంతో రైతులు తీవ్ర స్థాయిలో నష్టపోతున్నారు.

ముఠాలుగా ఏర్పడి..

దొంగలు పట్టణ ప్రాంతాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉంటూ ముఠాలుగా గ్రామాలకు బయలుదేరుతున్నారు. ఒకరోజు ముందు పరిశీలన చేసి అదే రాత్రి చోరీ చేస్తున్నారు. ఆయుధాలు తీసుకెళ్లి గంటలో పని పూర్తి చేస్తున్నారు. రాత్రికి రాత్రే తమ పనులు ముగించుకుని దొంగలు ఎవరికి దొరకకుండా చోరీలు చేస్తూ రైతులను ఇబ్బందులు పాలు చేస్తున్నారు.

కేబుల్ నుంచి మోటార్ల వరకు...

గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల వద్ద రైతులు 5 హెచ్‌పీ, 7.5 హెచ్‌పీ, 10 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేసుకుని ఆ నీటి వనరులతో వరి సాగు, వేరుశనగ, ఇతర పంటల సాగు చేపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అచ్చంపేట నియోజవర్గంలోని పలు ప్రాంతాల్లో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. స్టార్టర్ నుంచి మోటారు వరకు ఉండే కేబుల్‌ను చోరీ చేసేవారు. కాపర్ వైరుకు గిరాకీ ఉందని గుర్తించిన దొంగలు మోటార్లలోని రాగితీగ, నియంత్రికల్లోని వైర్ల చోరీకి అలవాటు పడ్డారు. ఎంతో కాలంగా ఇలా తంతు సాగుతోంది. కాగా ఇప్పటి వరకు అచ్చంపేట పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కాలేదు. రైతులు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. వ్యవసాయ పనులు వదులుకుని పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగలేక.. నష్టం భరిస్తూనే కేబుల్‌వైర్లు, మోటార్లు, ఇతర వస్తువులను కొనుగోలు చేసుకుని వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. కాగా ఈ విషయమైన పలు పోలీస్‌స్టేషన్లలో రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయా స్టేషన్ల ఎస్‌ఐలు తెలిపారు.